క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 11న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. శివనగర్, మధ్యకోట, తూర్పుకోట, పశ్చిమకోట, స్తంభంపల్లి, హోల్‌సేల్ గ్రెయిన్ మార్కెట్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు. అదేవిధంగా హనుమకొండలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాజీపేట సిద్ధార్థనగర్‌లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు నేషనల్ ఎడ్యుకేషన్ డే

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో మౌలానా అబుల్‌కలాం జయంతిని పురస్కరించుకొని ఈనెల 11న నేషనల్ ఎడ్యుకేషన్ డేను నిర్వహించనున్నారు. కేయూలోని ఆడిటోరియంలోని మౌలానా ఆజాద్ సెంటర్ ఫర్ మైనార్టీస్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, మైనార్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ కనీజ్ ఫాతిమా, తదితరులు పాల్గొంటారు.

టఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రతాప్



మడికొండ: టఫ్ (తెలంగాణ ఉద్యమకారుల ఫోరం) హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా మడికొండ గ్రామానికి చెందిన గద్దం ప్రతాప్‌ను నియమించినట్లు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించండి

హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించాలని రైతుబంధు సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు, బీఆర్‌ఎస్ నాయకుడు విక్టర్‌బాబు కోరారు. ఈమేరకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆదివారం కలిసి విజ్ఞప్తి చేశారు. అలాగే, కేసీఆర్‌ను ఐనవోలు దేవస్థాన మాజీ డైరెక్టర్ గిన్నారపు రవి, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు వల్లాల శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మామునూరు: వరంగల్ తిమ్మాపురం గ్రామం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆకులపెల్లి మౌనిక, కంజర్ల దేవేందర్ ఇటీవల డీఎస్సీలో ప్రతిభ కనబరిచి ఉపాధ్యాయులుగా ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. ఈమేరకు తిమ్మాపురం ఏకశిల యూత్ అసోసియేషన్, లైబ్రరీ ఆధ్వర్యంలో వారిని యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మ్యాకల సూరయ్య, తదితరులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో మురళీకృష్ణ, శ్రీకాంత్, ఆకులపల్లి మధు, కన్నయ్య, సభ్యులు పాల్గొన్నారు.

బకాయిలు వసూలు చేయిస్తాం



వరంగల్: కాశిబుగ్గ 19వ డివిజన్‌లోని వివేకానందం కాలనీ పరపతి సంఘానికి బకాయి పడిన (డిఫాల్టర్లు) సభ్యుల నుంచి ప్రత్యేక కమిటీ వేసి వసూలు చేయిస్తామని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మైటి సాగర్ అన్నారు. డివిజన్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సంఘం సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు గాదెం కొమురయ్య అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ 13ఏళ్ల క్రితం ఏర్పడిన సంఘం సహకారంతో కాలనీలో పలు అభివృద్ధి పనులు చేయడంతో పాటు సభ్యుల అవసరాలకు రుణాలు అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో కాలనీకమిటీ బాధ్యులు సత్యనారాయణ, యాదగిరి, లింగమూర్తి, అనిల్, రవీందర్, ఆకారపు సత్యనారాయణ, చంద్రమౌళి, క్యాతం రంజిత్, మోహన్, సత్యం, యుగేందర్, లక్ష్మణ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

మామునూరు: భార్యను కోల్పోయి మనస్థాపంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన 87 ఏళ్ల వృద్ధుడు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం రాత్రి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామానికి చెందిన తుమ్మ వెంకట్‌రెడ్డి భార్య ఆరు నెలల క్రితం మృతిచెందింది. నాటి నుంచి తీవ్ర మనస్థాపానికిలోనైన వెంకట్‌రెడ్డి.. శనివారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి వృద్ధుడు మరణించాడు. మృతుడి కుమారుడు తుమ్మ రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మామునూరు ఎస్సై కృష్ణవేణి తెలిపారు.

తూర్పార పడితేనే కాంటా

- వడ్ల గింజ పరిమాణం లెక్కింపు
- తాలు ఉంటే నిరాకరణ
- ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు
- మిల్లర్లకు ధాన్యం విక్రయిస్తున్న రైతులు.. అదేబాటలో కౌలు రైతులు



ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



సంచులపై ముద్రవేస్తున్న రైతులు

హసన్‌పర్తి: తూర్పార పడితేనే కాంటా వేస్తాం.. లేకుంటే తూర్పార పట్టి తాలు లేకుండా వడ్లు తీసుకురావాలని అధికారులు సూచించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల వద్ద నెలకొన్న పరిస్థితి ఇదీ. గత ప్రభుత్వాలు తీసుకొచ్చిన ధాన్యాన్ని కాంటాలో బస్తాకు ఎంతోకొంత కోతపెట్టి కొనుగోలు చేసేవి. ఇప్పటి రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న నిబంధనలు శాపంగా మారాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నత్తనడకన సాగుతున్న కేంద్రాలు

గ్రామాల్లో ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ అవి నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని కేంద్రాలకు మిల్లులు కేటాయించినప్పటికీ, మరికొన్ని గ్రామాల్లో కేంద్రాలు ప్రారంభించినా మిల్లుల కేటాయింపు జరగలేదు.

గింజ పరిమాణం లెక్కింపు

కొత్త నిబంధనల మేరకు ప్రత్యేక పరికరంతో గింజ పరిమాణాన్ని లెక్కిస్తున్నారు. ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల మేరకు గింజ పరిమాణంలో తేడా వస్తే నిరాకరిస్తున్నారు. సన్నరకం ధాన్యం నింపే బస్తాపై సెంటర్ కోడ్ నంబర్‌ను ముద్రించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలకు లోబడి ఉండి వ్యవసాయ అధికారులు ధ్రువీకరిస్తేనే సంబంధిత రైతులకు టోకెన్ జారీ చేస్తున్నారు. ఆ తర్వాత బస్తాల్లో ధాన్యం నింపుకుని వస్తే ఆయా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాంటా వేస్తున్నారని అన్నదాతలు చెబుతున్నారు. అయితే, కేంద్రాలకు బస్తాలు ఇచ్చినప్పటికీ సుతిలి దారం మాత్రం సరఫరా చేయలేదని రైతులు వెల్లడించారు.

గ్రామాల్లోకి దళారులు

ప్రభుత్వ నిబంధనలు కఠినంగా ఉండడంతో గ్రామాల్లోకి దళారులు ప్రవేశించారు. ప్రస్తుతం సన్నరకం ధాన్యాన్ని రూ.2,320తో పాటు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, దళారులు మాత్రం రూ.2,300 నుంచి రూ.2,500 వరకు డబ్బులు ఇచ్చి వడ్లను కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే బోనస్ డబ్బులు పట్టాదారులు ఇవ్వరనే అనుమానంతో కౌలురైతులు నేరుగా మిల్లులకే ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. అలాగే, పచ్చివడ్లను రూ.1,950 నుంచి రూ.2 వేల వరకు దళారులు ఖరీదు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

కొత్త నిబంధనలతో ఇబ్బందులు



రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన కొత్త నిబంధనలతో రైతులు ఆగం అవుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లిన ధాన్యాన్ని నేరుగా కాంటా వేసి కొనుగోలు చేయాలి. వడ్లు తూర్పార పట్టాలంటే మిషన్‌ను సమకూర్చాలి.

\- మారెపల్లి రాంచంద్రారెడ్డి, రైతు

కఠిన నిబంధనలు సరికాదు



గతంలో ఉన్న నిబంధనల మేరకు బియ్యం కొనుగోలు చేయాలి. నిబంధనలకు లోబడి లేకుంటే బస్తాకు కిలో చొప్పున కోత విధించి ఖరీదు చేయాలి. ప్రభుత్వం కఠినతరంగా నిబంధనలు విధించడం సరికాదు.

\- గంట వెంకట్‌రెడ్డి, రైతు

నిబంధనల మేరకు కొనుగోలు

ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. తాలు లేకుండా ధాన్యాన్ని తీసుకురావాలని రైతులకు సూచిస్తున్నాం. వడ్లలో నాణ్యత ప్రమాణాలు లెక్కిస్తున్నాం. మద్దతు ధర, బోనస్ అందిస్తున్నాం.

\- అనురాధ, వ్యవసాయాధికారి

వర్సిటీల అభివృద్ధిని విస్మరిస్తున్న ప్రభుత్వాలు



అమరులకు జోహార్లు అర్పిస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల అభివృద్ధిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పేద విద్యార్థులకు దూరం చేస్తున్నాయని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు విమర్శించారు. కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ ఎదుట పీడీఎస్‌యూ విద్యార్థి అమరవీరుల స్మారక వారోత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్లవ వీరుల అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లోని పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థులకు ఫెల్లోషిప్‌లు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని వాపోయారు. రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకుండా జాప్యం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ కేయూ నాయకులు బాలకృష్ణ, పవన్‌కల్యాణ్, శివ, గణేష్, అనూష, అఖిల, హేమ, స్వాతి, వెన్నెల, ప్రియాంక, అర్చన, నవ్య, తేజ, లక్ష్మి, నిహారిక, చైతన్య పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి కృషి



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రామన్నపేట: పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పూర్వ విద్యార్థులు స్పష్టం చేశారు. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రచార కార్యదర్శి అక్షయ్ అధ్యక్షతన 70 ఏళ్ల వేడుక సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తాము చదువుకున్న కళాశాలలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడానికి, విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించడానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. త్వరలోనే 70 ఏళ్ల వేడుక నిర్వహణకు అడ్‌హక్ కమిటీ ఏర్పాటు చేసి కార్యక్రమ విజయవంతానికి చేయాల్సిన కార్యాచరణను రూపొందిస్తామని పూర్వ విద్యార్థులు వివరించారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాసులు, రామాప్రసాద్, నాగ రాజారావు, బండి శ్రీనివాస్, దొడ్డిపల్లి కుమార్, పూర్ణచందర్, పూదరి శ్రీకాంత్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు అండగా ఉంటాం



కాకతీయ ఆటో డ్రైవర్స్ యూనియన్ నూతన కమిటీతో ఎమ్మెల్యే నాయిని

హన్మకొండ చౌరస్తా: ఆటో కార్మికులకు కాంగ్రెస్ సర్కార్ అండగా ఉంటుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కాకతీయ ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర నూతన కమిటీ సభ్యులు హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ కమిటీ బాధ్యులు రాయికంటి రఘు, అంకుశావలి, సయ్యద్ గౌస్, కుర్రి మధు, జక్కుల శ్రీనివాస్, సిద్ది సదానందం, మర్రిపల్లి కుమారస్వామి, షఫీక్ అహ్మద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై మహాన్యాస రుద్రాభిషేకం



మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు



భక్తులతో కిక్కిరిసిపోయిన శ్వేతార్క ఆలయం

మడికొండ: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మెట్టు రామలింగేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంపై ఆదివారం సామూహిక మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం ప్రదోషకాల రుద్రాభిషేకం, నీరాజన మంత్రపుష్పం, నక్షత్ర హారతి, పవళింపు సేవా నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి కే.శేషు భారతి, శివాలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణశర్మ, ధర్మకర్తలు బైరి రాజుగౌడ్, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, వస్కుల ఉమ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

శ్వేతార్క ఆలయంలో ప్రత్యేక పూజలు

కాజీపేట: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో సప్త నది జలాలతో స్వామివారికి పండితులు ఆదివారం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన భక్తులు అధిక సంఖ్యలో శ్వేతార్క ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ఆవరణలో కొలువుదీరిన 29 దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ విశిష్టత, నిత్య పూజల వివరాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వర్లుశర్మ వివరించారు. అన్నపూర్ణ భవన్‌లో భక్తులందరికి మహాన్నదానం చేశారు.

మాజీ మంత్రి కేటీఆర్‌కు స్వాగతం

మడికొండ: వరంగల్‌కు ఆదివారం విచ్చేసిన బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, శంకర్‌నాయక్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు బస్కె రాజేందర్, మర్యాల కృష్ణ, ఈదురు అనిల్, గాండ్ల భిక్షపతి తదితరులు స్వాగతం పలికారు.

బాపూజీనగర్‌లో..

కాజీపేట రూరల్: కేటీఆర్‌కు మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్‌ఎస్ నాయకులు కాజీపేట బాపూజీనగర్ చౌరస్తాలో స్వాగతం పలికారు. నార్లగిరి రమేష్, గబ్బెట శ్రీనివాస్, ఎం డీ.అఫ్జల్, సుంచు కృష్ణ, పాలడుగుల శివ, సుంచు అశోక్, దువ్వ కనకరాజు, బెదరకోట రంజిత్, కోండ్ర శంకర్, మర్యాల కృష్ణ, బరిగెల వినయ్, మతిన్, సుంచు రఘురాం, బొల్లె కుమార్ పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి ఫోర్ట్‌రోడ్డు వద్ద..



ఖిలా వరంగల్: వరంగల్ అండర్ బ్రిడ్జి ఫోర్ట్‌రోడ్డు పెరకవాడ నుంచి వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించి కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మరుపల్ల రవి, మాజీ మార్కెట్ డైరెక్టర్ రమేష్ బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల పూజలకు ముస్తాబు

- హరిహరిపుత్ర అయ్యప్ప దేవాలయంలో నవంబర్ 11 నుంచి డిసెంబర్ 22 వరకు వేడుకలు



మండల పూజలకు ముస్తాబవుతున్న ఆలయం

కాజీపేట రూరల్: 30వ సంవత్సర మండల పూజ మహోత్సవాల కరపత్రాలను కాజీపేట రైల్వే హరిహరపుత్ర శ్రీధర్మశాస్త్ర దేవాలయంలో గురుస్వాములు, ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురుస్వాములు బుర్ర జనార్దన్ గౌడ్, బంగారి కుమారస్వామి మాట్లాడుతూ దేవాలయంలో నవంబర్ 11నుంచి డిసెంబర్ 22వ తేదీ వరకు జరిగే మండల పూజలను పురస్కరించుకొని ధ్వజారోహణం, నిత్య అన్నప్రసాద వితరణ, శ్రీదేవి భూదేవి సమేత విష్ణుకల్యాణం, ఆరట్టు, శ్రీవల్లీసమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు వివరించారు. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 25వ తేదీ వరకు నిత్య అన్నప్రసాద వితరణ, డిసెంబర్ 21, 22వ తేదీల్లో మండల పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల పూజల సందర్భంగా దేవాలయాన్ని సుందరంగా ముస్తాబు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆకుల పాపయ్య, బంగారి కుమారస్వామి, ఆవాల పురుషోత్తంరెడ్డి, పిల్లల కుమారస్వామి, కేదారి, సంపత్, పాక శ్రీనివాస్, విజయ్, నల్లికాంత్, దశరథం, అరూరి సాంబయ్య, నటరాజు, రమేష్, మణికంఠ, భద్రారెడ్డి, దండిగం సదానందం, బ్రహ్మచారి, సమయచారి, రాజేష్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న తుమ్మ వీరయ్య

వరంగల్ చౌరస్తా: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్‌జీపీఏటీ కాశిబుగ్గ ఏరియా అధ్యక్షుడు తుమ్మ వీరయ్య డిమాండ్ చేశారు. వరంగల్ 26వ డివిజన్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పెన్షనర్ల సమావేశాన్ని రాజయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ ఐదు డీఆర్‌లో ఒకటి మాత్రమే అమలు చేసి, పెన్షనర్ల నడ్డి విరిచారని ఆరోపించారు. పీఆర్‌సీ 25శాతం అమలు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు భిక్షపతి, శ్యామల్, రఘుపతి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో కోతకాల పండుగ



కాజీపేట రూరల్: కాజీపేట బాపూజీనగర్ మెయిన్‌రోడ్డులోని గెత్సెమనే ప్రార్థన మందిరంలో ఆదివారం కృతజ్ఞతార్పణల (కోతకాల) పండుగ నిర్వహించారు. కరుణాపురం క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరం దైవజనుడు రెవరెండ్ డాక్టర్ గోపు జయప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొని బైబిల్ సందేశం చేశారు. కోతకాల పండుగను పురస్కరించుకొని చర్చి సభ్యులు చర్చికి తీసుకొచ్చిన వస్తువులను వేలంపాటతో కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో గెత్సెమనే చర్చి పాస్టర్ ఆర్.రవిపాల్, సంఘం పెద్దలు, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు బంద్

కాటన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

వరంగల్: రైతుకు అనుకూలమైన జిన్నింగ్, ప్రెస్సింగ్ మిల్లుల వద్ద పత్తిని సీసీఐ కొనుగోలు చేయకుండా కొర్రీలు పెట్టడం వల్ల నేటి(సోమవారం) నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లను ప్రైవేట్, సీసీఐ కేంద్రాల్లో నిలిపేస్తున్నట్లు రాష్ట్ర కాటన్ వెల్ఫేర్ అసోసియేషన్, వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఐ ఆదివారం కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్‌గుప్తాకు లేఖలు రాసినట్లు తెలిపారు. మొన్నటి దాకా తేమ అంటూ ఆంక్షలు పెట్టిన సీసీఐ ఇప్పుడు ఎల్-1, ఎల్-2, ఎల్-3 అంటూ కొత్త రకం ఆంక్షలు పెట్టడం వల్ల పత్తి రైతులకు, జిన్నింగ్ మిల్లులకు రవాణా నష్టాలు వస్తున్నాయన్నారు. సీసీఐ టెండర్లలో కఠినమైన పరిస్థితుల కారణంగా.. తెలంగాణ రాష్ట్ర పత్తి జిన్నింగ్, ప్రెస్సింగ్ మిల్లులు పాల్గొనలేదని తెలిపారు. దీనిపై సెప్టెంబర్ 9న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన వరంగల్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ సీసీఐ, సీఎండీ, సీసీఐ బ్రాంచ్ మేనేజర్లు, రాష్ట్ర కాటన్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం జరిగిందని పేర్కొన్నారు. ఇందులో టెండర్ షరతులు, రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లుల సమస్యలపై విస్తృత చర్చలు జరిగినట్లు పేర్కొన్నారు. సీసీఐ సహకరించనప్పటికీ జిన్నింగ్ మిల్లుల నిర్వాహకులు అధిక రేట్లు కోట్ చేసినప్పటికీ బేల్‌కు రూ.5 లు అసోసియేషన్ జిన్నర్స్‌ను ఒప్పించినట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే



కరీమాబాద్‌లో వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు



హసన్‌పర్తి: సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలో రెండో రోజు ఆదివారం ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను ఎన్యుమరేటర్లు నిర్వహించారు. సూపర్‌వైజర్ అశోక్ నేతృత్వంలో ఇల్లిల్లు తిరుగుతూ సమగ్ర వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, తదితరులు ఉన్నారు.

సమగ్ర సర్వే పర్యవేక్షణ

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సిద్ధాపురం గ్రామంలో చేపడుతున్న కులగణన సర్వేను మండల అభివృద్ధి అధికారి ప్రవీణ్‌కుమార్ ఆదివారం పర్యవేక్షించారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 నుంచి 175 ఇళ్లు కేటాయించారు. వారు ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న తీరును ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారికి సలహాలు, సూచనలు చేశారు. పక్కాగా సర్వే చేపట్టాలని సూచించారు. సర్వేకు గృహ యజమానులు సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్య తీసుకోవాలి



కులగణన తీరును పరిశీలిస్తున్న అధికారులు

వరంగల్: దేశాయిపేటలో చేపట్టిన కులగణనలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ రాంరెడ్డిని వరంగల్ కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. 'కుల గణనలో ఇబ్బందులు' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. జెడ్పీ సీఈఓ ఆదేశాల మేరకు 12, 13వ డివిజన్లలో కొనసాగుతున్న కులగణనను డిప్యూటీ కమిషనర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణారెడ్డి, ఆర్ఓ శ్రీనివాస్, టీఎంసీ రమేష్ పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సురేష్‌కుమార్ జోషి, కాలనీవాసులు పాల్గొన్నారు.

రైల్వే టీటీఐ మృతికి సంతాపం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే కమర్షియల్ డిపార్ట్‌మెంట్‌లో టీటీఐ నాగరాజు మరణం తీరనిలోటని రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ అన్నారు. కాజీపేటకు చెందిన నాగరాజు గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి నగరంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందారు. నాగరాజు మృతికి రైల్వే జేఏసీ నాయకులు సంతాపం ప్రకటించారు.

భారీ వాహనాల రాకపోకలతో ఇబ్బందులు

- మూణ్నాళ్ల ముచ్చటగా బారికేడ్ల నిర్మాణం
- ఏర్పాటు చేసిన మూడు రోజులకే ఢీకొట్టిన భారీ వాహనాలు
- మళ్లీ నిర్మించాలని కోరుతున్న స్థానికులు



ఢీకొట్టడంతో విరిగిపోయిన బారికేడ్ (ఫైల్)



గ్రామంలో నుంచి వెళ్తున్న లారీ

మడికొండ: మడికొండ – ధర్మసాగర్ రహదారిపై భారీ వాహనాల రాకపోకలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించక పోవడంతో ప్రస్తుత ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సూచనల మేరకు మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ చొరవ చూపి మడికొండ చౌరస్తా, పెద్దమ్మ ఆలయం వద్ద బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఇకనుంచి భారీ వాహనాలు గ్రామంలోకి రావని పోలీసు సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఆ మురిపెం మూడు రోజులు కూడా గడవకముందే బారికేడ్లను భారీ వాహనాలు ఢీకొట్టాయి. దాంతో అవి చెల్లాచెదురుగా పడిపోయాయి. దాంతో మళ్లీ భారీ వాహనాలు గ్రామంలో నుంచి రాకపోకలు యథావిధిగా సాగిస్తున్నాయి. ఈక్రమంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బారికేడ్లు ఏర్పాటు చేయాలి



బారికేడ్లు నిర్మించిన రెండు రోజులకే భారీ వాహనాలు ఢీకొట్టాయి. దాంతో అవి కూలిపోవడంతో యథావిధిగా భారీ వాహనాలు గ్రామంలో నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. దాంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వాహనాలు ఒకేసారి పదుల సంఖ్యలో రావడంతో మలుపుల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

\- కొత్తకొండ వెంకన్న గౌడ్, స్థానికుడు

భారీ వాహనాలు రాకుండా చూడాలి



మడికొండ – ధర్మసాగర్ రహదారిపై భారీ వాహనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రోడ్డు పక్కన ఉన్న ఇళ్లల్లోకి దుమ్మూధూళి వస్తోంది. రణగొణ ధ్వనులతో చెవులు పగిలిపోతున్నాయి. రోడ్డు ఇరుకుగా ఉండడంతో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. అధికారులు, పాలకులు స్పందించి బారికేడ్లను తిరిగి ఏర్పాటు చేసి, భారీ వాహనాలు గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలి.

\- ఎలిశాల మహేష్, మడికొండ

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
కె. సుధాకర్ (ACO) : 9177258410 (హన్మకొండ)
పి.చంద్రశేఖర్ (ACO) : 9963646944 (వరంగల్)